క్లుప్తంగా

ముగిసిన సర్పంచ్‌ల శిక్షణ తరగతులు

అచ్చంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్యం, వీధిలైట్ల నిర్వహణపై గత రెండు రోజులుగా జరుగుతున్న సర్పంచ్‌ల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. గ్రామ పంచాయతీల అభివృద్ధి, మంచినీటి సరఫరా, వీధిలైట్ల క్రమబద్ధీకరణ, దోమల నివారణ తదితర అంశాలపై ఎంపీడీఓ కె.కుసుమకుమారి సర్పంచ్‌లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, పంచాయతీ విస్తరణాధికారి వీర్రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సంతకాల ఉద్యమం

పెదకూరపాడు: పెదకూరపాడు రైల్వేస్టేషన్‌లో పల్నాడు ఎక్స్‌ప్రెస్‌తో పాటు రేపల్లె ఫాస్ట్ ప్యాసింజర్‌కు హాల్ట్ కల్పించే వరకు రాజధాని ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి సంతకాలు సేకరణ ఉద్యమం చేపడతామని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్ చంద్రజ్యోతిశ్రీ, పల్నాడు జిల్లా రైతు కూలీ సంఘం కార్యదర్శి దర్శి శేషారావులు అన్నారు. పల్నాడు ఎక్స్‌ప్రెస్ హాల్ట్‌కు సంబంధించి ఇంటింటికి సంతకాలు సేకరణ కార్యక్రమం మూడవ రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్, పాఠశాలలతో పాటు వర్తక వ్యాపార సముదాయాల నిర్వాహకులతో సంతకాలు సేకరించారు. పెదకూరపాడు ప్రాంత చిరకాల కోరిక పల్నాడు ఎక్స్‌ప్రెస్ హాల్ట్ కల్పించే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

ముప్పాళ్ళ: సాగర్ ఆయకట్టు పరిధిలో వరి సాగు చేసే రైతులకు అవసరమైన విత్తనాలు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ శనివారం చెప్పారు. తక్కువ రోజుల పంటకాలం గల ఎస్ఎల్ఆర్ 34449 రకం విత్తనాలు అన్ని గ్రామాల్లోని ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. 25 కిలోల బస్తా రూ.920 చొప్పున అందిస్తామన్నారు. కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రంలోని వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించవచ్చన్నారు.

ఎయిడ్స్ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం



చిలకలూరిపేట(యడ్లపాడు): పట్టణంలోని గుండయ్యతోటలోని రోష్ని సర్వీంగ్ సొసైటీలో శనివారం హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆరా ఫౌండేషన్ 17వ వసంతంలోకి అడుగిడిన సందర్భంగా బాధిత చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో హెచ్ఐవీ కౌన్సిలర్ వెంకటరమణ, రోష్ని స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు జిలానీబాషా మాట్లాడారు. చిన్నారులు చక్కగా చదువుకోవాలని వారికి కావాల్సిన మంచి పౌష్టికాహారాన్ని దాతల సాయంతో ఏర్పాటు చేస్తామన్నారు. వీటిని తమ సంస్థ ద్వారా రెండో శనివారం, రెండో గురువారం పట్టణ, పరిసర ప్రాంతాల్లోని హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధిత కుటుంబాలకు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమం అనంతరం బాధిత చిన్నారులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నేహారా హిన్, అనిత, సుభాని తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు పులిహోర పంపిణీ



కారెంపూడి: కారెంపూడిలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో కరాలపాటి భిక్షాలు కుటుంబ సభ్యులు శనివారం 500 మంది భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు.

నేడు ధ్వజస్తంభాల ప్రతిష్టా మహోత్సవం

వెల్దుర్తి: మండలంలోని మండాది గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో రాతి, చెక్క ధ్వజస్తంభాల ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమంతో పాటు శిఖర నాగ ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం మండలంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం 9.18నిమిషాలకు ప్రతిష్ట జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలు మూడు రోజుల నుంచి వేద పండితుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్నీ గ్రామాల నుంచి ప్రజలు వేలాదిగా పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

జనానికి పరేషన్..!

- ఇంటింటికీ రేషన్ పథకం రద్దు అంటూ సీఎం చంద్రబాబు ప్రకటనపై సర్వత్రా మండిపాటు
- జగనన్న ప్రవేశపెట్టిన రేషన్ పంపిణీ పథకానికి ప్రజల మెప్పు
- కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజలు మండిపాటు



కూటమి ప్రభుత్వ తీరుతో కనుమరుగు కానున్న సత్తెనపల్లిలోని ఎండీయూ వాహనాలు

సత్తెనపల్లి: పేదల పక్షపాతి అయిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2019 ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిచి ఐదేళ్ల సంక్షేమ పాలనను అందించారు. తాజా ఎన్నికల్లో విపక్ష నేతలు కూటమిగా కుమ్మక్కై అమలుకు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టారు. గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను దూషించిన కూటమి నేతలు .. అంతకంటే ఎక్కువ సంక్షేమాన్ని అందిస్తామంటూ నోటికి వచ్చిన వాగ్దానాలు గుప్పించారు. అధికారం చేపట్టాక అప్పులను సాకుగా చూపిస్తూ సంక్షేమ పథకాలను ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటింటికీ రేషన్ పథకం రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రకటనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతుంది. ప్రజా పంపిణీ సరుకులు ఎలా సరఫరా చేస్తారని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రయోజనం ఇలా...

సత్తెనపల్లి నియోజకవర్గంలో సత్తెనపల్లిటౌన్, సత్తెనపల్లిరూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలు ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 165 చౌక దుకాణాల పరిధిలో 55 ఎండీయూ వాహనాల ద్వారా 91,637 మంది రేషన్ కార్డుదారులకు సరుకులను పంపిణీ చేస్తున్నారు. ఆగస్టు నెలకు సంబంధించి కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేశారు. మొత్తం 1,269 టన్నుల బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు.

పథకం లక్ష్యం ఇది...

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ పథకానికి రూపకల్పన చేశారు. మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనాల ద్వారా ప్రజా పంపిణీలో నవశకానికి నాంది పలికారు. పేదలకు దూరాభారం, నిరీక్షణ అవస్థలకు స్వస్తి పలుకుతూ 2021 జనవరి 21న ఎండీయూ వాహనాలను అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఫిబ్రవరి 1న రాష్ట్రంలో 12 పట్టణాల్లో పంపిణీ ప్రారంభమైంది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ముగియడంతో ఫిబ్రవరి 23 నుంచి గ్రామాల్లో పంపిణీ ప్రారంభమైంది. నియోజకవర్గంలో 165 రేషన్ దుకాణాల పరిధిలో 91,637 మంది రేషన్ కార్డుదారులకు 55 ఎండీయూ వాహనాల ద్వారా సరుకులను ఈ–పోస్ యంత్రం ద్వారా జీపీఎస్ ట్రాకింగ్ పద్ధతిలో పంపిణీ చేశారు. మొత్తం పంపిణీ కార్యక్రమాన్ని సెంట్రల్ కమాండ్ కంట్రోల్‌తో పర్యవేక్షించారు. నూతన పథకం వచ్చిందని రేషన్ డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేయకుండా ఎండీయూలకు సరుకులను సరఫరా చేసే బాధ్యతను డీలర్లకు అప్పగించారు.

కరోనా సమయంలో...

సత్తెనపల్లి నియోజకవర్గంలో కరోనా వ్యాధి తీవ్రంగా ఉన్నప్పుడు ప్రజలు ఇంటికే పరిమితం కావలసి వచ్చింది. బయటకు రాకూడదన్న కఠిన నిబంధనల నేపథ్యంలో ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ పథకం విశేషంగా ఉపకరించింది. పని కోల్పోయిన సామాన్యులకు రేషన్ సరుకులే ఆసరా అయ్యాయి. పారదర్శకంగా సరుకులు పంపిణీ చేసేందుకు లబ్ధిదారుని ఇంటికి వెళ్లి ఎలక్ట్రానిక్ కాటాలో తూకం వేసి అందజేశారు. కరోనా సమయంలో ఇంటింటికీ రేషన్ అందించడంలో ఎండీయూ నిర్వాహకులు, రెవెన్యూ ఉద్యోగులకు వలంటీర్లు సహకారం అందించారు.

ఇంటింటికీ రేషన్‌లో కూటమి ప్రభుత్వం యూటర్న్

ఇంటింటికీ రేషన్ పంపిణీలో కూటమి ప్రభుత్వం యూటర్న్ తీసుకుంది. ఎన్నికలకు ముందు జగన్ పథకాలన్నిటినీ కొనసాగిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చిన విషయం విదితమే. 60 రోజులకే యూటర్న్ తీసుకొని కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటింటికీ రేషన్ పథకాన్ని రద్దు చేస్తున్నట్లు చేసిన ప్రకటనపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తీరు ఆడలేక మద్దెలో ఓడు అన్నట్టుగా ఉంది. ఆర్థిక భారాన్ని భరిస్తూ పథకాన్ని అమలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి పాలనా తీరును అధ్యయనం చేయడానికి బదులు ఆయన పథకాలను రద్దు చేసేలా ఆ వ్యాఖ్యలు ఉన్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. వాహనాల కొనుగోలుతో రూ.1,500 కోట్ల నష్టం వాటిల్లిందంటూ చేసిన వ్యాఖ్యలు పూర్తి బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని పలువురు విమర్శిస్తున్నారు.



నాగన్నకుంట ఏరియాలో ఇంటింటికీ నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం(ఫైల్)

పేదలపై ప్రతాపం సరికాదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు మాసాలు అవుతుంది. ఒక్కటంటే ఒక్క పథకం ప్రవేశపెట్టక పోగా పేదలపై ప్రతాపం చూపడం సరైంది కాదు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తానే కాదు ఎవరు అధికారంలోకి వచ్చిన సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిందే అన్న పద్ధతిలో వాటిని రూపొందించారు. ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ పథకం ఎండీయూ నిర్వాహకులకు 2027 వరకూ కాంట్రాక్టు కొనసాగనుంది. పేదల సౌకర్యం కోసం ఈ పథకాన్ని కొనసాగించాల్సిందే.

–పెండెం బాబురావు,
ఏఎంసీ మాజీ చైర్మన్, సత్తెనపల్లి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పిడుగురాళ్ల: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయుర్వేద వైద్యులు మేఘమాల అన్నారు. పట్టణంలోని 6వ వార్డులో ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేఘమాల మాట్లాడుతూ ప్రజలు వర్షాలు పడుతున్న క్రమంలో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దీనివలన దోమలు ప్రబలి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె తెలిపారు. అనీమియా, హెచ్ఐఎన్ రోగాలపై కూడా అవగాహన కల్పించి ప్రజలకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారికి అభినందన

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ బి.మురళీధర్ ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీసుకు బదిలీ అయిన సందర్భంగా శనివారం వైద్యశాల అధికారులు, సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. రెండు సంవత్సరాల పాటు ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేసి అన్ని గ్రామాల ప్రజలకు ఆయన సుపరిచితులయ్యారని వైద్యులు డాక్టర్ రేవతిబాయి అన్నారు. వైద్యసేవలు అందించటంలో ఆయనకు నిర్ణయించిన లక్ష్యాలను పూర్తిచేసి వైద్య సిబ్బందికి పూర్తి సహకారాలు అందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో సురేష్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎస్ఎంలు, ఆశాలు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో శ్రేయస్సు

ప్రకృతి వ్యవసాయం స్టేట్ రిసోర్స్ పర్సన్ జానకి



రైతులకు సూచనలిస్తున్న జానకి, చిత్రంలో పలువురు అధికారులు

నకరికల్లు: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుభూముల్లో ప్రీమాన్ సూన్ డ్రై సోయింగ్ వేసుకోవడం ద్వారా భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం స్టేట్ రిసోర్స్ పర్సన్ జానకి అన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో స్థానిక రైతుసేవాకేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామసంఘం ఆధ్వర్యంలో ఎన్‌పీఎం షాపులు ఏర్పాటు చేసి ఇన్‌పుట్స్ అందుబాటులో ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఎన్‌పీఎం దుకాణాల్లో ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం, దశపర్ణి, పంచగవ్య, మీనామృతం, కోడిగుడ్డు నిమ్మరసం ద్రావణం అందుబాటులో ఉండేలా చూస్తే మరింత మంది ప్రకృతి వ్యవసాయం చేసే అవకాశం ఉంటుందన్నారు. 365 రోజులు ఉండే కిచెన్ గార్డెనింగ్ వేసేలా మహిళలను ప్రోత్సహించాలని అన్నారు. కిచెన్ గార్డెన్‌లో పండ్లమొక్కలు, ఆకుకూరలు, కూరగాయలు, దుంపజాతి, తీగజాతి మొక్కలు ఉండేలా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. నకరికల్లులోని రుసుం సాంబయ్య అనే రైతు ప్రీమాన్ సూన్ డ్రైసోయింగ్ పద్ధతిలో 30 రకాల విత్తనాలతో సాగుచేస్తున్న పొలాన్ని సందర్శించి రైతును అభినందించారు. జిల్లా అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ ప్రేమ్‌రాజ్, ఎన్ఎఫ్ఏ అప్పలరాజు, మాస్టర్ ట్రైనీ బాజీబాబు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి యూటీఎఫ్ కృషి

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

నరసరావుపేట: ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యారంగం కోసం తమ యూనియన్ గత యాభై ఏళ్ల నుంచి ఇతోధికంగా కృషిచేసిందని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారథి పేర్కొన్నారు. యూనియన్ ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించి, జెండాను ఆవిష్కరించారు. అనంతరం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న తమ సంఘం ఏర్పాటైందన్నారు. విద్యారంగం అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమానికి అనేక ఉద్యమాలు చేసిందన్నారు. రాష్ట్రంలో పాలకులు ఎవరు ఉన్నా మిగతా ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని ఐక్య పోరాటాలు చేశామన్నారు. ఉపాధ్యాయుల జీతభత్యాలు కోసం పోరాటాలు నడిపామని, ప్రకృతి వైపరీత్యాలు, కరోనా లాంటి విపత్కర పరిస్థుల్లో పెద్ద ఎత్తున సేవ చేశామన్నారు. అప్రెంటీస్ రద్దు, ఇంక్రిమెంట్లు, మహిళా ఉపాధ్యాయులకోసం అదనపు సెలవులు సాధించామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విజయసారథి మాట్లాడుతూ వచ్చే డిసెంబర్‌లో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామని, జిల్లాలో కూడా సభలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉపాధ్యాయులకు ఆటలు, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శులు షేక్ జమాల్, ఎన్.సుందరరావు జిల్లా సహ ఉపాధ్యక్షులు ఎం.మోహనరావు, ఏ.భాగేశ్వరీదేవి, జిల్లా కార్యదర్శి ఉషాశౌరిరాణి, పాల్గొన్నారు.

1364 మందికి సీసీఆర్‌సీ కార్డులు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 1,364 మంది కౌలు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రుణ అర్హత (సీసీఆర్‌సీ) కార్డులు అందచేసినట్లు మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పంట సాగుదారుల చట్టం–2019 (సీసీఆర్‌సీ)పై మండలంలోని కౌలు రైతులకు అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. సీసీఆర్‌సీ కార్డులు పొందడం ద్వారా ఈ–పంట నమోదు చేసుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. రైతులకు ఇన్సూరెన్స్, పండించిన పంటను అమ్ముకొనేందుకు, రుణాలు పొందేందుకు, వివిధ ప్రభుత్వ పథకాలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులైన కౌలు రైతులను గుర్తించి రుణఅర్హత కార్డులను మంజూరు చేస్తారన్నారు. ప్రతికూల వాతావరణం వలన వేసిన పంటలు నష్టపోయిన సమయంలో కౌలు రైతులకు ఈ రుణ అర్హత కార్డుల వలన ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందుతుందని గుర్తు చేశారు. సీసీఆర్‌సీ కార్డులపై భూ యజమానులకు ఎటువంటి నష్టం జరగదని, దీనిపై వారికి కౌలు రైతులకు అవగాహన కల్పించి కార్డులను మంజూరు చేయాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారిణి, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి సాగుదారు సీసీఆర్‌సీ కార్డు పొందాలన్నారు.

దమ్ము ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి



మందా వెంకటేశ్వర్లు మృతదేహం



ట్రాక్టర్ కింద పడిన వెంకటేశ్వర్లును బయటకు తీసేందుకు యత్నిస్తున్న స్థానికులు

బెల్లంకొండ: మాగాణి పొలంలో దిగబడిన ట్రాక్టర్‌ను మరో ట్రాక్టర్‌తో బయటకు లాగుతుండగా బోల్తాపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపాలెం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మందా వెంకటేశ్వర్లు (41) సాయంత్రం సమయంలో ట్రాక్టర్‌తో వెళ్లి పొలంలో దమ్ము తోలుతున్నాడు. ఈక్రమంలో ట్రాక్టర్ దిగబడడంతో మరో ట్రాక్టర్‌తో లాగేందుకు ప్రయత్నిస్తుండగా పొలం వద్ద కాలువ సమీపానికి రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ కింద పడి వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు కాపాడేందుకు యత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పిల్లలు ఎవరికీ వివాహాలు కాలేదు. వెంకటేశ్వర్లు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ



క్రోసూరు: కేరళలోని వయనాడ్ ప్రాంతంలోని వరదబాధితుల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో శనివారం విరాళాలు సేకరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రవిబాబు మాట్లాడుతూ కేరళ రాష్ట్రం వయనాడు ప్రాంతంలో కురిసిన అతిభారీ వర్షాల వలన అక్కడ ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, వారిని మానవతా సాయంతో అందరూ ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, అచ్చంపేట కార్యదర్శి రావెల వెంకటేశ్వర్లు నాయకులు చిలక యేసయ్య, గర్నెపూడి మహేష్, కె.అనూష, ఐలం గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పిచర్లలో నేడు పోలేరమ్మ తల్లి ఉత్సవం

కారెంపూడి: శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో పోలేరమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాన్ని గ్రామస్తులు ఆదివారం నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలో అందరూ సమష్టిగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొననున్నారని నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉంటే పేటసన్నెగండ్ల సింగరుట్ల లక్ష్మీనారసింహాస్వామికి ప్రత్యేక పూజలు, నృసింహస్వామికి శాంతి హోమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కార్యక్రమానికి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధులకు అన్నసంతర్పణ



సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి రూరల్ మండల అధ్యక్షుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమరావు జన్మదినోత్సవాన్ని పురస్క రించుకొని వైఎస్సార్ సీపీ మండల నాయకుడు బొడ్డు వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఆదరణ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, మొల్లమాంబ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్న సంతర్పణ నిర్వహించారు. పరివర్తన మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు అన్నసంతర్పణ నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



నరసరావుపేట రూరల్: పల్నాడు విజ్ఞాన కేంద్రం, సీఐటీయూ ఆధ్వర్యంలో లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పల్నాడు బాలోత్సవాల కమిటీ అధ్యక్షుడు సీహెచ్ రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. అత్యవసర సమయంలో రక్తం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. 30 మంది ఉపాధ్యాయులు, యువకులు రక్తదానం చేశారు. రక్తదానం వలన వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ గుంటూరు విజయ్‌కుమార్, కార్యదర్శి అనుముల వెంకటేశ్వరరెడ్డి, పల్నాడు బాలోత్సవాల కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయనాయక్, నాయకులు మల్లేశ్వరి, శివకుమారి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి జస్టిస్

జాతీయ చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్ సన్మానసభలో పట్టాభి కళాపీఠం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్



వజ్రగిరి జస్టిస్‌ను సత్కరిస్తున్న వివిధ సంస్థల బాధ్యులు

సత్తెనపల్లి: జస్టిస్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ఆయన చిత్రకారుడే కాకుండా, గాయకుడు, తబలా వాచకారుడు, రచయిత, దైవజనులని ప్రభుత్వ అవార్డు గ్రహీత, పట్టాభి కళాపీఠం అధ్యక్షుడు తూములూరి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్ అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి, భారతీయ చిత్ర కళారత్న అవార్డు, కర్ణాటక కుంచె గుర్తు అవార్డు, లాగోస్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ వారి గౌరవ డాక్టరేట్ పొందిన సందర్భంగా సత్తెనపల్లి కళా మిత్రమండలి, ఉషోదయ కళాపరిషత్, రోటరీ క్లబ్ సత్తెనపల్లి సంయుక్త ఆధ్వర్యంలో జస్టిస్‌కు పట్టణంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో శనివారం ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సభలో రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాతంగి సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వజ్రగిరి జస్టిస్ భవిష్యత్తులో మరెన్నో కీర్తి పతాకాల అందుకుంటారన్నారు. వజ్రగిరి జస్టిస్‌తో పాటు ఉషోదయ కళా పరిషత్ అధ్యక్షుడు పిన్నమనేని పాములయ్యలను వేర్వేరుగా సత్కరించారు. కార్యక్రమంలో ఆయా సంస్థల బాధ్యులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసరాలు పొందిన వారితో కార్డ్స్ సంస్థ ప్రతినిధులు

నరసరావుపేట: దళితుల విద్యాభివృద్ధికి బాలబాట ద్వారా తమ సంస్థ కృషి చేస్తుందని కార్డ్స్ సంస్థ గుంటూరు జిల్లా డెప్యూటీ డైరెక్టర్ టి.పుష్ప పేర్కొన్నారు. శనివారం తొమ్మిదో వార్డు శ్రీనివాస కాలనీలోని లాల్‌బహదూర్ స్కూల్ దగ్గర బాలబాట డీవోల శిక్షణ తరగతుల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్థానిక ఏరియా కోర్డినేటర్ నూనె ప్రకాశరావు అధ్యక్షత వహించారు. పుష్ప మాట్లాడుతూ పేదవర్గాలను గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలకు సిద్ధం చేసి బాలబాట ద్వారా వారికి తర్ఫీదు ఇచ్చి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించటమే కార్డ్స్ సంస్థ లక్ష్యమన్నారు. పల్నాడు జిల్లా డెప్యూటీ డైరెక్టర్ ఎ.సుబ్బారావు మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో పేదవర్గాలు అభివృద్ధి సాధ్యమన్నారు. గత 20 ఏళ్ల నుంచి గ్రామీణ ప్రాంతాలలో పిల్లలకు ఆటపాటలతో చదువు నేర్పుతున్నామన్నారు. 30 మందికి నెలవారీ నిత్యావసర సరుకులు డెప్యూటీ డైరెక్టర్ చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ శిక్షణ తరగతులలో ముప్పాళ్ల, నరసరావుపేట మండలాల ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న డీఏవో మురళి తదితరులు

నరసరావుపేటరూరల్: స్వల్పకాలిక రకాలైన వరి విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై అందజేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని పెదరెడ్డిపాలెంలో రాయితీపై వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి మురళి మాట్లాడుతూ ఎంటీయూ 1224, కేఎస్ఎం 1638 రకాల విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం కేజీ రూ.5 సబ్సిడీపై రైతులకు అందజేస్తుందని తెలిపారు. జేజీఎల్ 384 రకానికి ప్రత్యామ్నాయంగా స్వల్పకాలిక రకాలను రైతులు సాగుచేయాలని సూచించారు. ఎంటీయూ 1224, కేఎస్ఎం 1638, ఎస్ఎల్ఆర్ 34449 రకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కౌలు రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుడు, వీఆర్వోను సంప్రదించి సీసీఆర్‌సీ కార్డును పొందాలని తెలిపారు. కార్యక్రమంలో డీఏవో కార్యాలయ ఏడీఏ సీహెచ్ రవికుమార్, ఏడీఏ మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు, సర్పంచ్ ఇండ్లమూరి రామారావు, గ్రామ వ్యవసాయ సహాయకుడు పి.పవన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.